నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌సీపీడీసీఎల్–11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. నారాయణగూడ ఫీడర్ పరిధిలో గౌరమ్మ గల్లీ, సూర్యనగర్, నెహ్రూనగర్, మానసా ఎన్‌క్లేవ్, కల్లుకంపౌండ్, అరోరా డిగ్రీ కాలేజీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

19న తోటమాలి మాలిమి పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత డాక్టర్ జెల్ది విద్యాధర్ కవితా సంపుటి తోటమాలి మాలిమి ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 19న ఆదివారం సా.6 గం విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు రచయిత తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, బిక్కి కృష్ణ, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, ప్రముఖ కవి కోయి కోటేశ్వర్‌రావు, ప్రొఫెసర్ జి.వి.రత్నాకర్ హాజరుకానున్నారన్నారు.

చేర్చుకుంటేనే పోలా..!

అంబర్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఎత్తుగడలకు పదును పెట్టింది. అంబర్‌పేట నియోజకవర్గంలో గత 20 ఏళ్లుగా పార్టీకి పెద్దగా ఆదరణ లేదు. నాయకులు, కార్యకర్తలు సహితం ఇతర పార్టీలోకి వలస వెళ్లడంతో నామ్‌కే వాస్తిగా మారింది. అయితే అందుకు భిన్నంగా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక జరగగానే పార్టీలో నూతనోత్సాహం నెలకొంది. ఖైరతాబాద్ టికెట్ ఆశించిన కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డికి అంబర్‌పేట టికెట్ ఇవ్వడంతో స్థానిక నేతలు అలర్ట్ అయ్యారు. టికెట్ దక్కించుకున్న రోహిన్‌రెడ్డి ఎన్నికల ఎత్తుగడలకు తెరలేపారు. అంబర్‌పేటపై పట్టు ఉన్నట్లే వ్యవహరిస్తూ రోజురోజుకు కొత్త ప్రయోగాలు చేస్తుండడంతో నియోజకవర్గంలో చర్చనీయంశంగా మారింది.

విజయానికి దగ్గరిదారి..

నియోజకవర్గంలో 2.70 లక్షల ఓటర్లు ఉన్నారు. వారిని ప్రత్యక్షంగా కలవడానికి సమయం సరిపోదని గుర్తించిన నేతలు విజయానికి దగ్గరి దారిని ఎంచుకున్నారు. నియోజకవర్గంలో డివిజన్ల వారిగా ఇతర పార్టీల్లో కీలకంగా ఉన్న నేతలను ఎంచుకుని పార్టీలో చేర్చుకుంటున్నారు. గల్లీ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి నేతలను ఎవరిని వదిలిపెట్టడం లేదు. ఉన్న సమయంలో సగం సమయం ఎన్నికల ప్రచారం చేస్తే మిగతా సమయం చేరికల పైనే దృష్టి సారించారు. స్థానిక నాయకత్వంతో ఎన్నికల్లో గట్టెక్కేందుకు కాంగ్రెస్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతున్నట్లు సమాచారం.

స్థాయికి తగ్గ బేరం...

గతంలో పలువురు నేతలు నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీల్లోకి వలస వెళ్లారు. అయితే ఆయా పార్టీలో వారికి తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో వారు అసంతృప్తితో ఉన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని ఇతర పార్టీల్లో ఉన్న నేతలకు కాంగ్రెస్ పార్టీ గాలం వేస్తుంది. సమయం లేకపోవడంతో డబ్బులు ఎక్కువైనా పర్లేదు అన్నా వచ్చేయ్.. అన్న చందంగా ప్రస్తుతం అంబర్‌పేట్‌లో బేరం నడుస్తుంది. వెనుక ముందు చూడకుండా చేరికలను ప్రోత్సహిస్తుండడంతో స్థానిక నేతలు వలస బాటపడుతున్నారు.

ప్రయోగం ఫలించేనా?...

ఎన్నికల ముందు వివిధ పార్టీల నేతలు కండువాలు మార్చడం సర్వ సాధారణం స్వప్రయోజనాలే ధ్యేయంగా కండువా మార్చే నేతలు ఉంటారు. ప్రస్తుతం అంబర్‌పేట్‌లో కాంగ్రెస్ చేరికల ప్రయోగాన్ని నమ్ముకుంది. ఇది ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాల్సిందే..

నేడో రేపో సిట్టింగ్ కార్పొరేటర్లు?..

అంబర్‌పేటలో ఇప్పటికే బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, 2014కు ముందు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌తో పాటు పలువురు నాయకులు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నాయకత్వం లేని చిన్న చిన్న ప్రాంతాల్లో సహితం ఇతర పార్టీల నేతలను తీసుకుని బలోపేతం చేసే పనిలో పడ్డారు. రెండు మూడు రోజుల్లో ఇద్దరు సిట్టింగ్ కార్పొరేటర్లు సహితం హస్తం గూటికి చేరనున్నట్లు సమాచారం.

కాంగ్రెస్ షార్ట్‌కట్ రూట్

- ప్రచారం కన్నా ఇతర పార్టీల నేతలను చేర్చుకోవడమే లక్ష్యం
- త్వరలో ఇద్దరు సిట్టింగ్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం?
- ఇప్పటికే మాజీ కార్పొరేటర్ల చేరిక

తెలంగాణలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి



బీఆర్ఎస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబుకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్ రెడ్డి

కాచిగూడ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు గురువారం కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట అభ్యర్థి డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని వీడిన నేతలంతా తిరిగి సొంత (కాంగ్రెస్) గూటికి చేరుకుంటున్నారని, దీంతో అసెంబ్లీ ఎన్నికల అనంతరం తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు రాంబాబు తెలిపారు. అంబర్‌పేటలో పార్టీ అభ్యర్థి రోహిణ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చిట్టెడి నర్సింహారెడ్డి, మురళీకృష్ణ, గోవర్ధన్ రెడ్డి, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా..మళ్లీ ఆదరించండి

- బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్.



భోలక్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో దాదాపు రూ. 2 వేల కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని, రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. గురువారం ఆయన బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు టి.సోమన్ ఆధ్వర్యంలో ఎంసీహెచ్ కాలనీ, గంగపుత్ర కాలనీ, అంబేడ్కర్ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ముషీరాబాద్‌లో ఎన్నో క్లిష్ట సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయించానన్నారు. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. పేదలకు రూ.400లకే గ్యాస్ సిలెండర్, రూ 5 లక్షల బీమా తదితర హామీలను తప్పనిసరిగా అమలు చేసి తీరతామన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే చెత్త బుట్టలో వేసినట్లేనన్నారు., బీఆర్ఎస్‌తోనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయంలో పలువురు ముస్లింలు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టి.సునీల్, నాయకులు నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్‌చారి, బల్ల ప్రశాంత్, పూసగోరక్‌నాథ్, జి.రాజు, సయ్యద్ అహ్మద్ భక్తియార్, మోహిన్, నభి, నందికంటి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరిబొండాలు కొడుతున్న ముఠా గోపాల్

భోలక్‌పూర్ డివిజన్‌లో ముఠా జైసింహ ప్రచారం...

భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్, భోలక్‌పూర్ హౌస్, పద్మశాలి కాలనీ తదితర ప్రాంతాలలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ప్రజలు మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ముషీరాబాద్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన ముఠా గోపాల్‌ను రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. వై.శ్రీనివాస్‌రావు, రహీం, షరీఫ్, ఆర్.శ్రీనివాస్, శంకర్‌గౌడ్, ఉమాకాంత్, కృష్ణ, హరీష్, ప్రవీణ్, సునీల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో తనను రెండోసారి గెలిపించాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ గుండు, మజీద్‌లైన్, అచ్చయ్యనగర్, దయానంద్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న హామీలను వివరిస్తూ ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు తప్పుడు వాగ్దానాలు ఇస్తూ ఓట్లు దండుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వారి మాటలను నమ్మవద్దని సూచించారు.

రిసాలగడ్డలో..

ముషీరాబాద్ బీఆర్ఎకస్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు మద్దతుగా రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మోజెస్, మన్నె దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, యువజన నాయకడు ముఠా జైసింహ ముస్లీం మైనార్టీలను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేసి గోపాల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.



వృద్ధులతో మాట్లాడుతున్న ముఠా జైసింహ

గోల్నాక డివిజన్ నుంచే రాజకీయ ప్రస్థానం

అంబర్‌పేట్: గోల్నాక డివిజన్ ప్రజలు ప్రతి ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించారని ఈ ఎన్నికల్లోనూ అండగా ఉండాలని బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. గోల్నాక డివిజన్ ప్రజలు రాజకీయ జీవితాన్ని ఇచ్చారని వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటానన్నారు. గురువారం ఆయన డివిజన్‌లోని శంకర్‌నగర్, కొత్త బ్రిడ్జ్, గోల్నాక చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను పేరు పేరున పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు రెట్టింపు అవుతాయని ఓటర్లకు హామీ ఇచ్చారు.



గోల్నాకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్

ప్రతి పైసా లెక్కిస్తాం..

- రూ. 40లక్షలు దాటితే చర్యలు
- హైదరాబాద్ జిల్లా అభ్యర్థుల ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అధికారి సుభోద్‌సింగ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుభోద్‌సింగ్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల ఖర్చు రూ. 40లక్షలు మించరాదని, నిబంధనను అతిక్రమించి ఎలాంటి బిల్లులు చూపకుండా ఎన్నికల్లో ఖర్చు చేస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా అభ్యర్థుల ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అధికారి సుభోద్‌సింగ్ అన్నారు. పోటీ చేసిన ఏ అభ్యర్థి అయినా నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని, ఖర్చుల విషయంలో అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి వ్యవహరించాలని సూచించారు. గురువారం ముషీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు ఎన్నికల ఖర్చు, విధి విధానాలు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో సుభోద్‌సింగ్, ముషీరాబాద్ ఆర్‌వో వి. లక్ష్మినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఏజెంట్లు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల బరిలో ఉన్న ప్రతి అభ్యర్థి ప్రత్యేక ఖాతా ద్వారానే ఎన్నికలకు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి అభ్యర్థిపై ఎన్నికల కమిషన్ నిఘా ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పారదర్శకంగా ఎన్నికల జరిగే విధంగా అభ్యర్థులందరూ సహకరించాలన్నారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అసిస్టెంట్ అధికారి వంశీకృష్ణతో పాటు 28 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులు గైర్హాజరు...

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు సీపీఎం, బీఎస్పీ తదితర అభ్యర్థులు ఈ సమావేశానికి గైర్హాజరు కావడం గమనార్హం.

చౌకబారు విమర్శలు మానుకోవాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ చౌకబారు విమర్శలు మానుకోవాలని ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. గురువారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంజన్‌కుమార్ యాదవ్ ప్రచారానికి అనుమతులు రద్దు కావడానికి తమకు ఏమిటి సంబంధం అని ప్రశ్నించారు. ఈ ఆరోపణలతో అంజన్‌కుమార్‌యాదవ్ తన ఓటమిని అంగీకరించినట్టేనన్నారు. ఒకే కులం అయినంత మాత్రాన అందరూ బంధువులు కారని చిక్కడపల్లి ఏసీపీ, తమది ఒకే కులమైనప్పటికీ తమకు ఆయనతో బంధుత్వం లేదని స్పష్టం చేశారు. ఏసీపీ యాదగిరికి, తమకు బంధుత్వం ఉన్నట్లు అంజన్ కుమార్‌యాదవ్ నిరూపించగలరా అని సవాల్ విసిరారు. తమ బంధువే అయితే మూడు రోజుల క్రితం తన వాహనాన్ని ఎందుకు సీజ్ చేశారని ప్రశ్నించారు. పోలీసులతో ఏమైనా సమస్యలు ఉంటే చట్టపరంగా చూసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో తమ కుమారుడు జైసింహ పదేళ్లుగా రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడని ప్రజల్లో మంచి ఆదరణ సంపాదించారన్నారు. ప్రజల్లో తమకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారని మారోపించారు. పాత బస్తీ తరహాలో రౌడీయిజం, గుండాయిజం చేస్తే ముషీరాబాద్ ప్రజలు సహించరని ఆయన హెచ్చరించారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కాచిగూడ: ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్ దత్ తెలిపారు. గురువారం రాత్రి కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో సాయుధ బలగాలు, పోలీసులతో ఆయన ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు, ఎస్సైలు రవికుమార్, మేఘన, సుభాష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోంది

ముషీరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తుందని 75 నుంచి 80 సీట్లకు పైగా సాధించి అధికారంలోకి రావడం ఖాయమని, ముషీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలుస్తారని కేరళ రాష్ట్ర మాజీ హోంమంత్రి రమేష్ చెన్నితల అన్నారు. గురువారం గోల్కొండ చౌరస్తాలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమేష్ చెన్నితల మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు మూడు ఒకే గూటి పక్షులని వీరికి ఓటు వేస్తే దేశంలో మరింత అవినీతి, అభద్రత పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారని ఒక్కసారి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించి రుణం తీర్చుకోవాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీలో పదవులు అనుభవించిన మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీని వీడినా అంజన్‌కుమార్‌యాదవ్ మాత్రం పార్టీకి అండగా ఉండి రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేశారన్నారు. అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రమేష్ చెన్నితల కేరళ రాష్ట్ర పార్టీ అధ్యక్షులుగా రాష్ట్ర హోంమంత్రిగా ప్రతిపక్ష నేతగా ఎన్నో బాధ్యతలు నిర్వహించి పార్టీని బలోపేతం చేశారన్నారు. యూత్ కాంగ్రెస్‌లో ఆయన నాయకత్వంలో తాను పని చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, టీపీసీసీ ఎన్నికరల పరిశీలకులు గౌరీశంకర్, ఏఐసీసీ పరిశీలకులు వాసు, మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేరళ మాజీ హోంమంత్రి రమేష్ చెన్నితల

పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లుల పాత్ర కీలకం

చిక్కడపల్లి: పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో తల్లుల పాత్ర కీలకమని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. జగతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో చిల్డన్స్ ఫెస్ట్– 2023 శీర్షికతో నిర్వహించిన చిల్డ్రన్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భం మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. ఫెస్ట్‌లో భాగంగా చిన్నారుల నృత్యప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపిక చేసిన వివిధ రంగాల ప్రముఖులకు సేవారత్న, నృత్యరత్న, విద్యారత్న, అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ నీలిమ, నిర్వాహక సంస్థ వ్యవస్థాపకురాలు ఆర్.శ్రీలక్ష్మీ, ప్రముఖులు వి.సుబ్రహ్మణ్యం, ఎస్.శ్రావణ్ కుమార్, పీఎస్ మూర్తి, బి.అపర్ణ, కేపీ చారి, లంకా లక్ష్మీనారాయణ, జి.వెంకట్‌రెడ్డి, అన్నపూ ర్ణ, జి.లక్ష్మయ్య, పి.విజయలక్ష్మి, విజయ్‌కుమార్, సైదులు, భూదేవి, కాంచన, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో బద్రుక విద్యార్థికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న గౌరవ్‌సింగ్

కాచిగూడ: ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీ ఫెన్సింగ్ టోర్నమెంట్ గురువారం విద్యానగర్‌లోని హిందీ మహావిద్యాలయంలో జరిగింది. ఈ పోటీల్లో కాచిగూడ బద్రుక కళాశాల బీబీఏ మూడో సంవత్సరం విద్యార్థి గౌరవ్ సింగ్ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో అతను ఔరంగాబాద్‌లో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గోల్డ్‌మెడల్ విజేత గౌరవ్ సింగ్‌ను లా కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ క్రిష్ణ గౌడ్, బద్రుక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్, డాక్టర్ జానకిరామ్, డాక్టర్ వెంకటయ్య, మనోజ్ కుమార్, రాజారామ్ తదితరులు అభినందించారు.

సామూహిక గీతా పారాయణం



నల్లకుంట: హిందూ తత్వశాస్త్రంలో భగవద్గీత ఒక పవిత్ర గ్రంథమని గణపతి సచ్చిదానంద స్వామి భక్తులు పేర్కొన్నారు. గణపతి సచ్చిదానంద స్వామి భక్త బృందం నిర్వహిస్తున్న 108వ భగవద్గీత పారాయణలో భాగంగా గురువారం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో సామూహిక గీతా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి సచ్చిదానంద భక్తులు భగవద్గీతలోని 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను రెండు గంటల్లో పారాయణ చేయడం విశేషం. గణపతి సచ్చిదానంద స్వామి అనుగ్రహాశీస్సులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్త బృందాన్ని శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు సన్మానించారు.

వైభవంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నల్లకుంట: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతీ దేవాలయం(న్యూ రామాలయం) భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని జ్ఞాన సరస్వతి మాత మందిరంలో అమ్మవారి మూల విరాట్‌ను పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గల యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవ ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, అమ్మవారికి నివేదించిన పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి చేశారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది.

ముమ్మరంగా ఓటర్ స్లిప్‌ల పంపిణీ



ఓటర్ స్లిప్‌ల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఈఆర్‌వో మారుతీ దివాకర్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రతి ఓటర్‌కు ఓటర్ స్లిప్పులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఆర్‌వో మారుతీ దివాకర్ తెలిపారు. గురువారం నియోజకవర్గంలోని జీఎచ్‌హెంసీ సిబ్బందితో కలిసి ఇంటింటికి ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేశారు. బిఎల్‌వోలు సమన్వయంతో ఓటర్ స్లిప్‌లను ప్రతి ఒక్కరికి అందించాలని సూచించారు. స్లిప్‌లు అందని వారు స్థానిక పోలింగ్ బూత్‌లో సంప్రదించాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



చిక్కడపల్లిలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తనను గెలిపిస్తే ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా చిక్కడపల్లిలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. అంతకు ముందు చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సోఫ్ ఫ్యాక్టరీ లేన్, అరోరా కాలేజ్ గల్లీ, సూర్యనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే ముషీరాబాద్‌ను అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. గతంలో రెండు పర్యాయాలుగా ఎంపీగా పని చేశానని అప్పుడు తాను చేసిన అభివృద్ధే నేటికీ కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ కంగ్రెస్ నాయకులు కాసాని ఆనంద్, లోకేష్‌యాదవ్, బి–బ్లాక్ అధ్యక్షులు అంజియాదవ్, శ్యామ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు కల్పనయాదవ్, వాజీద్‌హుస్సేన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే మార్పు సాధ్యం

- ఇందిరాపార్కులో బీజేపీ అభ్యర్థి పూసరాజు ప్రచారం



ఓటర్‌కు షేవింగ్ చేస్తున్న దృశ్యం

కవాడిగూడ: ఇందిరాపార్కులో వాకర్స్ మద్దతు కోరుతూ గురువారం ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే ఇందిరాపార్కు సమగ్ర అభివృద్ధి, వాకర్స్‌కు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీకి ఓటు వేసి ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేసి మరోసారి తప్పు చేయవద్దని కోరారు. మార్పుకోసం బీజేపీకి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సి మహేందర్ బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, వి.ఎస్ చారి, సురేష్‌ముదిరాజ్, గంట శ్రీనివాస్, సలంద్రి దిలీప్‌యాదవ్, అనిల్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అవినీతి రహిత పాలన

చిక్కడపల్లి: అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజు అన్నారు. గురువారం డివిజన్‌లోని వివేకానందనగర్ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ ఎ.పావనితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజవర్గంలో సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, వీఎస్టీ రాజు, శ్రీకాంత్, సత్తిరెడ్డి, సంధ్యారెడ్డి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు

ముషీరాబాద్: వర్గీకరణ సమస్య పరిష్కారానికి కమిటీ వేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బీజేపీకి మాదిగలు మద్దతు ఇవ్వాలని మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం పూస రాజు మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. పూస రాజు మాట్లాడుతూ వర్గీకరణ సమస్య పరిష్కారానికి ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకు మాదిగలందరూ బీజేపీకి ఓటు వేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దూరి శివాజీ, గజ్జెల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మందకృష్ణ మాదిగ మద్దతు కోరుతున్న ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు